సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 11 । ఆగస్టు । 2024



పెన్నాలో ఇసుక దందా..

ఇసుకను యథేచ్ఛగా మేసేందుకు.. 'ఉచిత ఇసుక విధానం' ఊతమవుతోంది. ఎక్కడికక్కడ ఎవరు పడితే వారు అందినకాడికి దోచుకుంటున్నారు.

-8లో



కళా కీర్తి కిరీటం.. పల్లేటి

నాటకమే ఊపిరిగా జీవించిన తెలుగు నాటసుప్రసిద్ధ నాటక కర్త పల్లేటి లక్ష్మీ కులశేఖర్ (70) శుక్రవారం రాత్రి కన్నుమూశారు.

-8లో

గరిష్టం/కనిష్టం
34.2/25.6

వాతావరణం

జిల్లాలో శనివారం 25.6 - 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

సెలవుల్లో కడప మీదుగా ప్రత్యేక రైళ్లు

కడప కోటిరెడ్డిసర్కిల్: స్వాతంత్ర దినోత్సవ నేపథ్యంలో వరుస సెలవుల కారణంగా కడప మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మీడియాకు వివరించారు. ఈనెల 14న తిరుపతి నుంచి కోడూరు, రాజంపేట, కడప, ముద్దనూరు, కొండాపురం మీదుగా నాగర్‌సోల్‌కు నడపనున్నారు. అలాగే 14 నుంచి 16 వరకు తిరుపతి-కాచిగూడ- తిరుపతి రైలును నడపనున్నామని వివరించారు. ఈ రైలు కోడూరు, కడప, ఎర్రగుంట్ల, కొండాపురం మీదుగా కాచిగూడకు చేరుతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

13 నుంచి స్టాఫ్ నర్సు నియామకాల కౌన్సెలింగ్

కడప రూరల్: ఈనెల 13 నుంచి 17వ తేది వరకు స్టాఫ్ నర్సు నియామకాల కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ (జోన్-4) ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కాంట్రాక్టు పద్ధతిన మొత్తం 206 పోస్టులను మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నామని వివరించారు. అందులో భాగంగా ఒక రోజుకు 50 మంది చొప్పున 13, 14, 16, 17 తేదీలలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.హెచ్ఎంఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

గండికోట ప్రాజెక్టుకు కృష్ణా జలాలు విడుదల



ఆవుకు రిజర్వాయర్ వద్ద పూజలు చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కొండాపురం : ఎగువ ప్రాంతాల నుంచి కురిసిన వర్షాలకు శ్రీశైలం జలాశయానికి భారీగా నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. గండికోట జలాశయానికి శనివారం నీటిని విడుదల చేశారు. అవుకు రిజర్వాయర్ వద్ద శనివారం సాయంత్రం రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ.జనార్దన్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కృష్ణా జలాలకు జలహారతి ఇచ్చారు. అనంతరం ఆవుకు రిజర్వాయర్ గేట్లు ఎత్తి జీఎన్ఎస్ఎస్ మెయిన్ కాల్వ ద్వారా గండికోట జలాశయానికి 11,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు సీఈ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గండికోట జలాశయంలో 26.85 టీఎంసీలు నిల్వ చేస్తామన్నారు. ఆదివారం సాయంత్రంలోగా గండికోట జలాశయానికి నీరు చేరుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి, జమ్మల మడుగు టీడీపీ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలుగుగంగకు నీరు విడుదల



కృష్ణా జలాలకు హారతి ఇస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్

దువ్వూరు/మైదుకూరు: దువ్వూరు మండలం చల్లబసాయపల్లె వద్ద ఉన్న ఎస్ఆర్-1 నుంచి శనివారం కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఎస్ఆర్-2, తెలుగుగంగ కాలువ, బ్రహ్మసాగర్‌లకు నీటిని విడుదల చేశారు. ముందుగా కలెక్టర్, ఎమ్మెల్యే కృష్ణా జలాలకు పూజలు చేసిన హారతి ఇచ్చారు. అనంతరం బటన్ నొక్కి గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తెలుగుగంగ జలాశాయాలు, కాలువల ద్వారా 96వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టులోని చివరి ఆయకట్టు వరకు నీటిని అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ ఇప్పుడు విడుదల చేసిన నీటితో మైదుకూరు నియోజకవర్గంలోని ఆరు చెరువులను నింపుతామని అన్నారు. తెలుగు గంగ సీఈ మల్లికార్జునరెడ్డి, ఈఈ కృష్ణారెడ్డి, డీఈ నాగిరెడ్డి, టీడీపీ నాయకులు బోరెడ్డి వెంకటరమణారెడ్డి, పాపినేని రాంబాబు, కారపురెడ్డి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల పరిశీలన

మైదుకూరులోని పలు ప్రభుత్వ కార్యాలయాలను శనివారం కలెక్టర్ లోతేటి శివశంకర్ పరిశీలించారు. పట్టణంలోని మండల పరిషత్, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ప్రజలకు దూరంగా ఉండటంతో ఏవైనా పనులపైన వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు.



ప్రత్యేక అలంకరణలో గండి వీరాంజనేయుడు

జై వీరాంజనేయ!

గండి భక్తులతో నిండిపోయింది.. జై ఆంజనేయా నినాదాలతో మార్మోగింది. శ్రావణ మాసం తొలి శనివార మహోత్సవ సందర్భంగా పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి సన్నిధి జనసంద్రమైంది. భక్తిపారవశ్యంతో ఓలలాడింది. కాగా నూతన ఆలయం నిర్మాణం పూర్తికాని కారణంగా మూలవిరాట్ కు బదులుగా బాలాలయంలో ధారువుతో ఏర్పాటు చేసిన విగ్రహానికే భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. స్వామి వారిని ఆలయ ప్రధాన ఉప ప్రధాన ముఖ్య అర్చకులు కేసరి,రాజారమేష్,రాజగోపాలాచార్యులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారి వెంకటసుబ్బయ్య చైర్మన్ కృష్ణతేజ పర్యవేక్షణలో తగు ఏర్పాట్లు చేశారు. శ్రావణమాసం వారోత్సవాల్లో భాగంగా తొలి శనివారం రోజే ఆలయానికి రూ.14,89,961లు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.

-చక్రాయపేట



స్వామి వారి దర్శనం కోసం బాలాలయం వద్ద భక్తుల సందడి

● దయచేసి వినండి..

ఢిల్లీ బండి.. రోజూ తిప్పండి!

- దివంగత సీఎం వైఎస్సార్ కృషితో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా మీదుగా సర్వీసు
- సీమలో సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు పెరుగుతున్న డిమాండ్
- హైదరాబాదు, ఢిల్లీ, ఉత్తర తెలంగాణ వాసులకు అనుకూలం
- లోక్‌సభ నియోజకవర్గ కేంద్రాల్లో హాల్టింగ్ కోసం వినతి

రాజంపేట: ఆధ్యాత్మిక నగరం తిరుపతి నుంచి దేశ రాజధానికి రాజంపేట, నందలూరు, కడప మీదుగా నడిచే ఢిల్లీ రైలు(12708/12707) డైలీ పట్టాలపై నడిచేదెప్పుడో అని రాయలసీమ, ఉత్తర తెలంగాణ వాసులు ఎదురు చూస్తున్నారు. గత 17 ఏళ్లుగా ఢిల్లీ రైలు వారానికి మూడు రోజులు మాత్రమే నడుస్తూ వస్తోంది. రాష్ట్ర రాజధానుల నుంచి, ఆయా రాష్ట్రాల్లోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాల మీదుగా దేశరాజధాని ఢిల్లీకి వేగవంతమైన ప్రయాణానికి నేరుగా అనుసంధానం చేసేందుకు కేంద్రంలో అప్పటి యూపీఏ సర్కారు రైల్వే మంత్రి లాలుప్రసాద్ యాదవ్ సంపర్క్ క్రాంతి రైలును తీసుకొచ్చారు. సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ఢిల్లీ నిజాముద్దీన్‌కు ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలును జూలై 2005లో పట్టాలెక్కించారు.

ఒకప్పుడు కేరళ ఎక్స్‌ప్రెస్ గతి...

రాయలసీమ ప్రాంత ప్రజలకు ముఖ్యంగా ఉమ్మడి కడప జిల్లా వాసులకు దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లేందుకు ఒక్కటంటే ఒక్క రైలులేదు. వీరు ఢిల్లీ, ఉత్తరాది నగరాలకు వెళ్లాలంటే రైలులో రేణిగుంటకు వచ్చి, అక్కడి నుంచి కేరళ ఎక్స్‌ప్రెస్ ద్వారా వయా నెల్లూరు, గూడూరు మీదుగా ఢిల్లీకి ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు ఉండేవి. అలాంటిది వైఎస్సార్ చొరవతో ఇప్పుడు నేరుగా జిల్లా మీదుగా దేశ రాజధానికి వెళ్లేందుకు రైలు అందుబాటులోకి వచ్చింది.



ఏపీ సంపర్క్ క్రాంతిని డైలీ నడపాలనే డిమాండ్

ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు డిమాండ్ ఉంది. ఈ రైలును ప్రతిరోజు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. సీమప్రాంత ప్రజలకు, ఉత్తర తెలంగాణ నగరాలకు, హైదరాబాదుకు వెళ్లేందుకు పగటిపూట జర్నీ అందుబాటులో ఉంటుంది. సాయంకాలానికి సికింద్రాబాదుకు చేరుకుంటుంది. రోజూ నడిస్తే కడప, రైల్వేకోడూరు, రాజంపేట, నందలూరు, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, కర్నూలు నుంచి కాజీపేట, పెద్దపల్లి, మంచిర్యాల, సిర్పూర్, కాగజ్‌నగర్ వెళ్లేందుకు ఉపయోగపడుతుంది.

17 ఏళ్లుగా రాజంపేట హాల్టింగ్ డిమాండ్


17 ఏళ్లుగా రాజంపేటలో హాల్టింగ్ కావాలని డిమాండ్ కేంద్రానికి వినిపిస్తూనే ఉన్నారు. ఎన్నోసార్లు కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ, రైల్వేబోర్డుకు రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి వినతులు అందజేశారు. ఇంతవరకు రైల్వే మంత్రిత్వశాఖ హాల్టింగ్ ఇచ్చిన పాపాన పోలేదన్న అపవాదును మూటగట్టుకుంది.

తిరుపతి, రేణిగుంట నుంచి ఢిల్లీ రైళ్లు ఫుల్..

తిరుపతి, రేణిగుంట మీదుగా ఢిల్లీ వెళ్లాలంటే కేరళ, హిమసాగర్, నవయుగ, స్వర్ణ జయంతి రైళ్లు నడుస్తున్నాయి. ఇవన్నీ తిరువనంతపురం, ఎర్నాకులం, కన్యాకుమారి నుంచి వస్తున్నాయి. వీటిలో రిజర్వేషన్ దొరకడం చాలా కష్టం. మూడునెలల ముందు కూడా సీట్లు దొరకవు. ఇవి గూడూరు-విజయవాడ-వరంగల్-పెద్దపల్లి మీదుగా వెళ్తాయి. ఇలాంటి పరిస్థితిలో ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌రైలు ప్రతిరోజు నడిపిస్తే ఉపయోగకరంగా ఉంటుందని కడప, అనంతపురం, కర్నూలు వాసుల నుంచి డిమాండ్ వినిపిస్తోంది.

దివంగత సీఎం వైఎస్సార్ చొరవతో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టి ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలుపై పడింది. ఈ రైలును తిరుపతి నుంచి కడప, రాజంపేట పార్లమెంటరీ కేంద్రాలైన రాజంపేట, కడప మీదుగా సికింద్రాబాదు వరకు నడిపించాలని రైల్వే మంత్రిత్వ శాఖను కోరారు. 2007లో ఈ రైలును తిరుపతి నుంచి రేణిగుంట, రాజంపేట, నందలూరు, కడప, గుత్తి, డోన్, కర్నూలు, మహబూబ్‌నగర్ మీదుగా సికింద్రాబాద్ టు ఢిల్లీకి పొడిగించారు.



రాజంపేటలో ఢిల్లీ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలి



పార్లమెంట్ హెడ్‌క్వార్టర్ రాజంపేట రైల్వే స్టేషన్‌లో ఢిల్లీ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలి. దశాబ్దంన్నరకు పైగా ఏపీ సంపర్క్ క్రాంతి రైలుకు స్టాపింగ్ ఇవ్వాలని రైల్వే మంత్రిత్వశాఖకు అనేక మార్లు విన్నవిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. ఎంపీ మిథున్‌రెడ్డి అనేక మార్లు హాల్టింగ్ కోరారు. ఉదయం పూట ఈ రైలుకు స్టాపింగ్‌తో ప్రతిరోజు నడిపిస్తే సికింద్రాబాదు, కర్నూలు, ఉత్తర తెలంగాణకు వెళ్లేందుకు వీలుంటుంది.

– చిల్లా కిరణ్, యూఎస్‌ప, వెంకటరెడ్డిపల్లె, రైల్వేకోడూరు

ఢిల్లీ రైలు హాల్టింగ్ డిమాండ్‌ను పరిశీలించాలి



రాజంపేటలో ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ డిమాండ్‌ను రైల్వేబోర్డు పరిశీలనలోకి తీసుకోవాలి. తిరుపతి వదిలితే కడప హాల్టింగ్ ఉంది. కనీసం రాజంపేట, నందలూరు, రైల్వే కోడూరులో హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. తెలంగాణకు పగటి పూట వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుంది. ఎంపీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి ఢిల్లీ రైలు హాల్టింగ్‌కు మళ్లీ కృషి చేయాలి.

–మర్రి రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్, రాజంపేట

28 మంది ఎంపీడీఓలకు పోస్టింగ్‌లు

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈసీఐ నిబంధనల మేరకు ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు చెందిన ఎంపీడీఓలు తిరిగి సొంత జిల్లాకు చేరుకున్నారు. ఇంతకుముందు పనిచేసిన మండలాల్లోనే వీరికి తిరిగి పోస్టింగ్‌లు ఇస్తూ జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ప్రొసీడింగ్స్ జారీ చేశారు.

పేరు	మండలం
జి.కృష్ణమూర్తి	సింహాద్రిపురం
ఎస్.నూర్జహాన్	బద్వేలు
పి.వరప్రసాద్	పెనగలూరు
సి.వెంకటేశ్	పులివెందుల
బి.మైథిలి	కాశినాయన
టి.వెంగమునిరెడ్డి	బ్రహ్మంగారిమఠం
సి.రామకృష్ణయ్య	గోపవరం
సి.వెంకట రమణయ్య	పెద్దముడియం
జె.సుజాతమ్మ	అట్లూరు
జి.రెడ్డెయ్య	ఒంటిమిట్ట
కేవీ శ్రీధర్‌నాయుడు	చాపాడు
సి.రాఘవేంద్రనాథ్	జమ్మలమడుగు
జి.సౌభాగ్యమ్మ	నందలూరు
ఏవీ రమణారెడ్డి	మైదుకూరు
ఎస్.భాగ్యలక్ష్మి	ఎర్రగుంట్ల
సీఏ జవహర్‌బాబు	సిద్దవటం
పి.జయశ్రీ	వల్లూరు
ఎ.మల్‌రెడ్డి	రాయచోటి
ఎస్.విజయరావు	ఓబులవారిపల్లె
ఎం.దివ్య	చిన్నమండెం
ఎస్.రామచంద్ర	టి.సుండుపల్లె
డి.మల్లేశ్వరి	వీరబల్లి
ఎస్.శ్రీనివాసరెడ్డి	గాలివీడు
ఎస్.శివరామిరెడ్డి	చిట్వేలి
జీవీ రఘురాం	పుల్లంపేట
ఎస్.ఫణిరాజకుమారి	రాజంపేట
ఎస్.సూర్యనారాయణరెడ్డి	రామాపురం
పి.మహబూబ్‌బీ	కలసపాడు

వక్ఫ్ ఆస్తులపై కేంద్రం కుట్ర



కడప రహమతీయ ఫంక్షన్ హాల్లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ అహ్మద్

- పార్లమెంటులో వక్ఫ్ చట్ట సవరణకు టీడీపీ మద్దతు దారుణం
- టీడీపీలోని మైనార్టీ నేతలు రాజీనామాలు చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష, ముస్లిం సంఘాల డిమాండ్

కడప వైఎస్ఆర్ సర్కిల్: వక్ఫ్‌బోర్డు ఆస్తులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వామపక్ష, ముస్లిం సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని రహమతీయ ఫంక్షన్ హాలులో 'వక్ఫ్ సవరణ బిల్లు-రాజ్యాంగ విరుద్ధం' అనే అంశంపై ఆప్ కీ ఆవాజ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని లక్షల కోట్ల విలువైన వక్ఫ్ బోర్డు ఆస్తులను మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. పార్లమెంటలలో సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు ఇచ్చిన నేపథ్యంలో ఆ పార్టీలోని ముస్లిం మైనార్టీ నేతలు తమ పదవులకు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో వక్ఫ్ చట్టసవరణ బిల్లుకు మద్దతు తెలియజేయడం ద్వారా సీఎం చంద్రబాబు మరోసారి ముస్లింలపై తన వ్యతిరేకతను బయటపెట్టారని ధ్వజమెత్తారు. వక్ఫ్ భూములను ముస్లింలకు మాత్రమే లీజుకు ఇవ్వాలన్న నిబంధనను సవరించి ఎవరికైనా ఇవ్వవచ్చని చేర్చడం దారుణమన్నారు. వక్ఫ్ ఆస్తుల అజమాయిషీ అధికారాలను పూర్తిగా కలెక్టర్లకు అప్పగించేలా సవరణ ప్రతిపాదించడం దారుణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్‌బాషా, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మహమ్మద్ అలీఖాన్, సలావుద్దీన్, ముస్లిం మైనార్టీ నేతలు బాబుభాయ్, అమీర్ బాబు, గౌస్‌పీర్, మౌలాలి, జాకీర్ మౌలాన, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు: సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వికసిత ఫౌండేషన్ సహకారంతో మహిళలకు ఉచిత హ్యాండ్ ఎంబ్రాయిడరీ (మగ్గం వర్క్) శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. స్థానిక సూపర్ బజార్ రోడ్డులోని సాయిదత్త హాస్పిటల్ ఎదురుగా ఉన్న సంస్థలో శిక్షణ ఇస్తారని ఆయన పేర్కొన్నారు. 45 రోజుల శిక్షణకు ఆసక్తిగల మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని వివరించారు. దరఖాస్తుల నమోదుకు 9154195061, 9642471600 నంబర్లలో సంప్రదించాలని వికసిత ఫౌండేషన్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి తెలిపారు.

ఇది రాజ్యాంగంపై దాడి!

- బాబు, పవన్ ప్రమేయం లేకుండా ఈ దాడి జరగలేదు
- చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు క్షమాపణ చెప్పాలి
- మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, కడప మేయర్ కె. సురేష్ బాబు
- కడపలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి, కొవ్వొత్తులతో నిరసన



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి, కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు తదితరులు

కడప కార్పొరేషన్: విజయవాడలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపైన జరిగిన దాడిని భారత దేశంపైన, రాజ్యాంగంపైన జరిగిన దాడిగా పరిగణించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, కడప మేయర్ కె. సురేష్ బాబు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో వారు నల్ల బ్యాడ్జీలు ధరించి, కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ 2014లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పుతామని చెప్పిన చంద్రబాబు ఆ పని చేయలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అంబేడ్కర్ విగ్రహం ఎక్కడో మారుమూల ఉండకూడదని, విజయవాడ నడిబొడ్డున బెంజిసర్కిల్ సమీపంలో 20 ఎకరాల్లో రూ.400కోట్లు ఖర్చు చేసి దేశంలోనే అతిపెద్దదైన అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పారన్నారు. దాన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు తాము అధికారంలోకి వస్తే అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చివేస్తామని అప్పుడే ప్రకటనలు చేశారని, అందులో భాగంగానే మొన్న లైట్లు అన్ని ఆర్పేసి, సందర్శకులను బయటికి పంపి, అధికారుల సమక్షంలోనే కత్తులు, రాడ్లు, సుత్తులతో శిలాఫలకాలను ధ్వంసం చేశారన్నారు. అంబేడ్కర్ సామాజిక న్యాయ శిల్పంపై టీడీపీ కార్యకర్తలు చేసిన ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చంద్రబాబు, పవన్‌ల ప్రమేయం లేకుండా ఈ దాడి జరగలేదని అనుమానం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రం యావత్తు తలదించుకునే దుశ్చర్య- మేయర్

రాష్ట్రంలోని 5కోట్ల ఆంధ్రప్రజలు తలదించుకునే దుశ్చర్యకు టీడీపీ నాయకులు పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, నగర మేయర్ కె. సురేష్ బాబు అన్నారు. దేశంలో 140కోట్లమంది ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవిస్తున్నారంటే అది అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లేనన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీకార దాడులు, దౌర్జన్యాలు, హత్యలు ఎక్కువయ్యాయని, ఇప్పటికే 36 మందిని టీడీపీ ప్రభుత్వం పొట్టనబెట్టుకుందన్నారు. విజయవాడ నడిబొడ్డున, గవర్నర్ బంగళాకు కూతవేటు దూరంలో ఉండే అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీవిభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ మాట్లాడుతూ దళితులంటే చంద్రబాబుకు మొదటి నుంచి చిన్నచూపే అని మండిపడ్డారు. ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాసీమ బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పులి సునీల్ కుమార్, కరిముల్లా, బండి ప్రసాద్, కె. బాబు, త్యాగరాజు, దేవిరెడ్డి ఆదిత్య, శ్రీరంజన్‌రెడ్డి, కిరణ్, అరీఫుల్లా బాషా, మేసా ప్రసాద్,చాంద్‌బాషా, రహీం, జాషువా, సంపత్, పస్తం అంజి, సీహెచ్ సునీల్, జఫ్రుల్లా, పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, మరియలు, నారాయణమ్మ, సుశీలమ్మ, తులశమ్మ, సునీత, మల్లీశ్వరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా ముత్తు మారమ్మ గ్రామోత్సవం



అన్నదానం చేస్తున్న భక్తులు

నందలూరు : మండలంలోని అరవపల్లిలో వెలసిన ముత్తుమారమ్మ తల్లి ఆలయంలో జాతర శనివారం ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజు శనివారం ఉదయం మహిళలు కుంకుమార్చన జరిపారు. సాయంత్రం ముత్తుమారమ్మ ఉత్సవ విగ్రహాన్ని పల్లకిపై ఉంచి ఆలయం నుంచి స్థానిక బస్టాండ్ కూడలి వరకు డప్పు వాయిద్యాలు, బాణసంచా మధ్య గ్రామోత్సవం జరిపారు. కాంతారా వేషధారణ భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం నీలిపల్లి గ్రామానికి చెందిన ఉప్పుశెట్టి ఆదినారాయణ, లక్ష్మీదేవి, ఉప్పుశెట్టి సుధీర్ కుమార్, ఉప్పుశెట్టి పృథ్వీరాజ్ 1500 మందికి అన్నదానం చేశారు.

అగ్ని ప్రమాదంతో లక్ష రూపాయల నష్టం



కాలిపోయిన టిఫిన్ సెంటర్

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని లక్ష్మీ ప్యారడైజ్ సమీపంలో శనివారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కారణంగా సిద్దయ్య టిఫెన్ సెంటర్ కాలిపోయింది. రెండు దుకాణాలకు మంటలు వ్యాపించాయి. లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధితుడు సిద్దయ్య తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.

తెలుగు నాటకరంగానికి తీరని లోటు

ప్రొద్దుటూరు కల్చరల్ : కళారత్న పల్లేటి కులశేఖర్ మృతి తెలుగు నాటకరంగానికి తీరని లోటు అని కడప జిల్లా రచయితల సంఘం జింకా సుబ్రహ్మణ్యం అన్నారు. ఆయన రచించిన నాటకాలకు 88 మంది నంది అవార్డులు గెలుచుకున్నారని వివరించారు. సాహిత్యంలోని అన్ని పకిరయల్లో ఆయన రచనలు చేశారని, 66 నాటకాలను రచించి.. పది సార్లు వ్యక్తిగతంగా నంది అవార్డులు అందుకున్నారని తెలిపారు. ఆరుగురు ముఖ్యమంత్రులచే, ముగ్గురు గవర్నర్లచే సత్కారం పొందారన్నారు. పల్లేటి కులశేఖర్ జిల్లా వాడు కావడం మనకు గర్వకారణమని, ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సంతాపం తెలుపుతున్నామని అన్నారు

ఈ క్రాప్ నమోదు.. షురూ

ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటల వివరాలను గుర్తించేలా ఇ–క్రాప్ నమోదుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతులకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుకోవాలంటే ప్రతి రైతు ఖచ్చితంగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పంటల నమోదు పక్రియ ప్రస్తుతం జిల్లాలో ముమ్మరంగా జరుగుతోంది.

- జిల్లా వ్యాప్తంగా ఇ–క్రాప్ నమోదు ప్రారంభం
- జియో ఫెన్సింగ్‌తో ఖచ్చితమైన వివరాల సేకరణ
- ఈ ఖరీఫ్‌లో నమోదుకు సెప్టెంబర్ 15 వరకు గడువు



బుగ్గలవారిపల్లెలో పసుపు పంటకు ఇ-క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది

కడప అగ్రికల్చర్ : జిల్లాలో ఇ–క్రాప్ నమోదుకు వ్యవసాయ, రెవెన్యూ శాఖలు శ్రీకారం చుట్టాయి. జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటల సాధారణ సాగు విస్తీర్ణం 304652.99 ఎకరాలు కాగా ఇప్పటివరకూ 1,16,460.95 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు 17966.72 ఎకరాల్లో పంటల వివరాలను ఇ–క్రాప్ చేశారు. ఇంకా 98494.22 ఎకరాల్లో ఈ నెల సెప్టెంబర్ 15వ తేదీ లోగా చేయాల్సి ఉంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట.. అతివృష్టి, అనావృష్టితో నష్టపోతే ఆ రైతుకు పరిహారం పొందేందుకు తన పంట ఖచ్చితంగా నమోదై ఉండాల్సిందే. గతంలో పరిహారం పొందేందుకు అధికారుల చుట్టూ రైతులు తిరిగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా ఇ–క్రాప్‌లో పంట నమోదు చేసుకున్న వారికి ప్రభుత్వం నేరుగా పరిహారం అందించనుంది. అంతేగాక నమోదులో పారదర్శకత కోసం గత ప్రభుత్వం జియో ఫెన్సింగ్ విధానం అమల్లోకి తెచ్చింది. దీంతో ఖచ్చితంగా పొలం వద్దకే వెళ్లి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో రైతుకు న్యాయం జరుగుతుంది. సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఇవ్వడంతో అధికారులు వేగవంతం చేశారు.

ముందస్తుగా సాగు చేసిన రైతులకు నష్టం

ఈ ఖరీఫ్‌లో జూన్ నెలలో కురిసిన వర్షాలకు 5వేల ఎకరాల్లో రైతులు మినుము, వేరుశనగ, పత్తి, కొర్ర, సజ్జలతోపాటు పలు రకాల పంటలను సాగు చేశారు. వర్షాభావ పరిస్థితులతో చాలా వరకు పంటలు ఎండుముఖం పట్టాయి. రైతులు చేసేదేమీలేక దున్నేశారు. ఎండిన పంటలు తొలగించిన తర్వాత ప్రభుత్వం ఇ–క్రాప్ నమోదుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రైతులకు నష్టపరిహారం అందేది ప్రశ్నార్థకంగా మారింది. పంటలు ఎండిపోవడంతో రైతులను అధికారులు గుర్తించి కనీసం విత్తనాలు, ఎరువులు, సేద్యపు ఖర్చులైనా చెల్లించాలని వేడుకుంటున్నారు.

జిల్లాలో ఇ- క్రాప్ నమోదు వివరాలు ఇలా (ఎకరాల్లో)

డివిజన్ పేరు	వ్యవసాయ, ఉద్యాన పంటల సాధారణ విస్తీర్ణం	సాగైన పంటల విస్తీర్ణం	ఇ–క్రాప్ నమోదైన విస్తీర్ణం
కడప	39880.09	9099.09	1526.90
పోరుమామిళ్ల	26550.34	7425.66	1338.40
మైదుకూరు	46442.89	6324.37	563.60
కమలాపురం	27247.24	13941.25	4972.20
పొద్దుటూరు	31087.29	5975.21	802.08
పులివెందుల	65261.96	45423.40	4591.22
బద్వేల్	10663.07	2865.60	1340.29
ముద్దనూరు	57520.11	25306.30	2832.03
మొత్తం	304652.99	116460.95	17966.72

ప్రతి రైతు ఇ-క్రాప్ చేయించుకోవాలి



ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఖచ్చితంగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతింటే ఈ క్రాప్ ఆధారంగానే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతులు తమ పంటల వివరాలు నమోదు చేయించుకోవాలి. – అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

ధర్మవరం–మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు

– అరగంట పాటు ప్రొద్దుటూరు స్టేషన్‌లో ఆగిన రైలు
– భయాందోళనతో పరుగులు తీసిన ప్రయాణికులు

అనంతపురం సిటీ: ధర్మవరం–మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. దీంతో రైలును మార్గ మధ్యంలోని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రైల్వే స్టేషన్‌లో అరగంట పాటు ఆపేశారు. అనంతపురం రైల్వే అధికారులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన సమాచారం ప్రకారం... శుక్రవారం రాత్రి ధర్మవరం నుంచి అనంతపురం మీదుగా మచిలీపట్నం బయలుదేరిన రైలు మార్గమధ్యంలోని ప్రొద్దుటూరుకు చేరుకునే సరికి బాగా పొద్దుపోయింది. స్టేషన్‌లో ఆగేందుకు పైలెట్ బ్రేక్ వేసే సమయంలో ఏసీ బోగీ వద్ద ఒక్కసారిగా పొగ వచ్చింది. స్టేషన్ ఆవరణమంతా ఆవరించింది. ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వర్షం పడడం, బ్రేకులను పదేపదే వేయడంతో ఏసీ బోగీ చక్రాల కింద పొగ వచ్చినట్లు రైల్వే అధికారులు గుర్తించారు.దీనివల్ల ఎటువంటి ప్రమాదం లేదని ప్రకటించారు. దీంతో అరగంట ఆలస్యంగా రైలు మచిలీపట్నం బయలుదేరి వెళ్లింది.

ఒకరికి గాయాలు

సుండుపల్లె : మండల కేంద్రంలోని సుండుపల్లె–పింఛా ప్రధాన రహదారిలోని గాజులపల్లె క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో బెస్తపల్లెకు చెందిన షేక్ జాఫ్రీకి గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనం ద్వారా తిరుపతి రమాదేవి మల్టీస్పెషాల్టీ హాస్పిటల్‌కు తీసుకెళ్లారని కుటుంబసభ్యులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సుండుపల్లె ఎస్‌ఐ హుస్సేన్ తెలిపారు.

కళా కీర్తి కిరీటం.. పల్లేటి

- రచయిత పల్లేటి లక్ష్మీ కులశేఖర్ కన్నుమూత
- 250 నాటకాలు రచించి సరికొత్త రికార్డు
- తెలుగు తెరకు నటి 'రోజా'ను పరిచయం చేశారు



లక్ష్మీకులశేఖర్ (ఫైల్)



లక్ష్మీకులశేఖర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

కడప కల్చరల్ : నాటకం ఆయన ఊపిరి.. నాటక రంగ కళకు కీర్తి తెచ్చి.. 88 నంది అవార్డులు సొంతం చేసుకున్న రచయిత. తెలుగు నాట సుప్రసిద్ధ నాటక కర్త.. జిల్లాకు చెందిన పల్లేటి లక్ష్మీ కులశేఖర్ (70) శుక్రవారం రాత్రి కన్నుమూశారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా రైల్వేకోడూరులో నివాసముంటున్న ఆయన.. గుంటూరు నుంచి వస్తుండగా.. మార్గమధ్యంలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన భౌతిక కాయాన్ని రిమ్స్ వద్ద గల కొత్త సమాధుల తోటలో శనివారం ఖననం చేశారు. నగరానికి చెందిన రంగస్థల నటులు, ప్రయోక్తలు పల్లేటికి ఆత్మీయ మిత్రుడైన వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, పల్లేటిపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పొందిన వైవీయూ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి, తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. లక్ష్మీ కులశేఖర్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈయన కుటుంబం ప్రస్తుతం రైల్వేకోడూరులో ఉంటోంది.

రామాయణ యజ్ఞం

సవేరా వెంకటయ్య ప్రోత్సాహంతో ఆయన రామాయణాన్ని శ్రీరామ పాదుకలు, శ్రీరామ వనవాసం, శ్రీరామ పట్టాభిషేకం పేరిట నాటకాలు రాసి రామాయణ నాటకయజ్ఞంగా ప్రదర్శనలిచ్చారు. క్రైస్తవుడైన ఆయన ఈ అంశంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నా... నాటకరంగం ఇచ్చిన భరోసాతో ముందుకు సాగారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి జీవిత చరిత్రను నాటకాలుగా రాశారు. ఆయనపై యోగి వేమన విశ్వవిద్యాలయంలో కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి పీహెచ్‌డీ చేశారు.

88 నంది అవార్డులతో..

వీరబల్లి మండలంలోని గడికోట ఆయన స్వస్థలం కాగా మరియమ్మ, విలియమ్స్‌లకు తెలుగునాట పల్లేటి లక్ష్మీకులశేఖర్ జన్మించారు. రాయచోటిలో చదువుకుంటున్న సమయంలో గురువు కమాల్ సాహెబ్ ఆయన ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. ఆయన వద్దనే కులశేఖర్ తెలుగులో మెలకువలు నేర్చుకున్నారు. 1980లో కడప నగరంలోని నాటి సీనియర్ రంగస్థల నటులు, దర్శకులు వైఎస్ సిలార్‌తో ఏర్పడిన పరిచయం సాంఘిక నాటక రచన వైపు మళ్లించింది. 1982లో సవేరా ఆర్ట్స్ సంస్థ వ్యవస్థాపకులు అళ్లారి వెంకటయ్యతో పరిచయం పల్లేటి జీవితాన్ని రంగస్థలం వైపు మళ్లించింది. సాంఘిక నాటకాలతోపాటు పౌరాణిక, పద్య నాటక రచన ప్రారంభించారు. దాదాపు అన్ని పక్రియల్లో రచనలు చేశారు. రేడియో నాటకాలు, రూపకాలు, టీవీలు, సినిమాలకు కథలు, పాటలు, సీరియళ్లు ఇలా దాదాపు 250కి పైగా రచనలు చేశారు. సవేరా సంస్థకు ఆయన అస్థాన రచయితగా పేరు తెచ్చుకున్నారు. తెలుగునాట దాదాపు అన్ని ప్రముఖ నాటక సంస్థలకు ఆయన స్క్రిప్ట్ అందించారు. ప్రముఖ సినీ నటి ఆర్‌కే రోజాను ఆయన రచన ప్రేమ తపస్సు సినీ రంగానికి పరిచయం చేసింది. ఆయన రచనల ప్రదర్శనలకు 88, ఆయన వ్యక్తిగతంగా పది నందులు గెలుచుకున్నారు. ప్రతిష్టాత్మక హంస(కళారత్న) అవార్డు, ఎన్టీఆర్ అవార్డు, గురజాడ, పైడి లక్ష్మయ్య, గరుడ అవార్డులు సాధించారు. ఆయన రచించిన రెండు, మూడు నాటకాలకు విభాగాల్లో రెండు, మూడు నందులు దక్కడం విశేషం.

అండర్–19 టోర్నీలో సెంచరీల మోత



వరుణ్ సాత్విక్ (147 పరుగులు)



ఖాజా మొహిద్దీన్ (133 పరుగులు)



నాగకుమార్ (6 వికెట్లు)



యశ్వంత్ (132 పరుగులు)



పరమ్‌వీర్ సింగ్ (128 పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా జట్టు, విశాఖ జట్టు బ్యాట్స్‌మన్ చెలరేగారు. నలుగురు బ్యాట్స్‌మన్ సెంచరీలు నమోదు చేయడం గమనార్హం. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 23 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కృష్ణా జట్టు 105 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 335 పరుగులు చేసింది. జట్టులోని వరుణ్ సాత్విక్ 147 పరుగులతో నాటౌట్‌గా నిలువగా, ఖాజా మొహిద్దీన్ 133 పరుగులతో రాణించారు. రెండోరోజు ఆట ముగిసే సమయానికి కృష్ణా జట్టు 76 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

పశ్చిమగోదావరి జట్టు.. భళా

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 58 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన శ్రీకాకుళం జట్టు 80.1 ఓవర్లలో 243 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రాజ్‌కుమార్ 65, సుశాంత్ 55 పరుగులు చేశారు. పశ్చిమగోదావరి బౌలర్లు రేవంత్ నాగకుమార్ 6, హర్షవర్ధన్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పశ్చిమగోదావరి జట్టు 22 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 66 పరుగులు చేసింది. కాగా పశ్చిమగోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 231 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి పశ్చిమగోదావరి జట్టు 54 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది.

ఆధిక్యంలో విశాఖ జట్టు..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 16 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన విశాఖ జట్టు 89 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 381 పరుగులు చేసింది. జట్టులోని యశ్వంత్ 132 పరుగులు, పరమ్‌వీర్ సింగ్ 128 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. నెల్లూరు బౌలర్లు భార్గవ్ మహేష్ 3, బతీష్‌కుమార్ 2 వికెట్లు తీశారు. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 331 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి విశాఖ జట్టు 50 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

రోవర్.. భూమిని కొలిచేస్తుంది..



అత్యాధునిక టెక్నాలజీతో రోవర్ పరికరం.. రైతులకు అందుబాటులోకి వచ్చింది. పొలంలో తక్కువ సమయంలో ఖచ్చితమైన కొలతలు తీసేందుకు.. మోసాలు జరగకుండా చూసేందుకు ఈ పరికరం ఉపయోగపడుతుంది. దీని విలువ రూ.10 లక్షలు. గతంలో కొలతలు తీయాలంటే రెవెన్యూ అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. రోవర్ పరికరం అందుబాటులోకి వచ్చినా.. రైతులు ప్రైవేట్‌గా తెచ్చుకోవాలంటే రోజుకు వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. పులివెందుల నియోజకవర్గంలో అందుబాటులో ఉన్న రోవర్లను రైతులు ఉపయోగించుకునేలా చూడాలని వారు కోరుతున్నారు. – సింహాద్రిపురం

నిర్లక్ష్యం..ప్రాణం తీస్తుంది..



చిన్నారులకు ప్రమాదకర ప్రయాణం తప్పడం లేదు. బడి వదలగానే ఊరికి చేరాలనే ఆత్రతతో ఆటో వెనుక డోర్ వద్ద ఇలా ఇరుక్కుని కూర్చుని బతుకు దేవుడా.. అన్నట్లు వెళ్తున్నారు. బస్సు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో పలువురు విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. చిన్నారులను సైతం ఇలా ఆటోలో వెనుక వైపున కుక్కి డోర్ వేసి పాఠశాలకు, ఇంటికి తీసుకుపోతున్నారు. ఏమాత్రం డోర్ కదిపినా చిన్నారుల ప్రాణాలు పణంగా పెట్టాల్సిందే మరి.. – మదనపల్లె సిటీ

పెన్నాలో ఇసుక దందా..

ఇసుకను యథేచ్ఛగా మేసేందుకు.. 'ఉచిత ఇసుక విధానం' ఊతమవుతోంది. ఎక్కడికక్కడ ఎవరు పడితే వారు అందినంతా దోచుకుని బయట విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం పరిధిలోని పెన్నానదిలో మరింత విజృంభించి.. ఇష్టానుసారంగా తోడేస్తున్నారు.



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

జమ్మలమడుగు : మండలంలోని పెన్నా నదిలో ఇసుకను తోడేస్తున్నారు. గత ఐదేళ్ల కాలంలో ఇసుక అక్రమ రవాణాకు కొంత మేర బ్రేకులు పడగా.. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే అక్రమ రవాణా జోరందుకుంది. ఇటీవల ఓ సమావేశంలో ఇసుక అక్రమంగా తరలిస్తే.. పట్టుకుని లక్ష రూపాయల వరకు జరిమానా విధించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చెప్పినా.. అధికారులు మాత్రం అడ్డుకట్ట వేయలేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

దేవగుడి ప్రక్క గ్రామాల నుంచే...

దేవగుడి చుట్టు ప్రక్కల గ్రామాలు, టిక్కాయ ఫేనువీధి, దిగువపటణం ప్రాంతాల నుంచి సాయంత్రం అయ్యే సరికి పెద్ద ఎత్తున ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతోంది. వంద ట్రాక్టర్లకు తక్కువ కాకుండా నిత్యం పెన్నానది నుంచి నంద్యాల జిల్లా ప్రాంతాలకు ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. పెన్నాలో ఇసుకకు మంచి డిమాండ్ ఉండడం.. టన్ను ఇసుకకు రూ.15 వేల వరకు ధర ఉండడంతో అక్రమార్కులు అప్పనంగా ఇసుకను తోడి తరలిస్తున్నారు. రెండు ట్రిప్పులు అమ్ముకున్నా.. ఖర్చులు పోనూ రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఆదాయం ఉంటుందనే భావన ట్రాక్టర్ల యజమానులకు కలుగుతోంది. దీంతో భారీ స్థాయిలో పెన్నా నదిని తోడేస్తున్నారు. తమ పిల్లలు ఆడుకుంటున్నారని, పెన్నానది నుంచి వేగంగా ఇసుక ట్రాక్టర్లు వెళ్తుండడంతో ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులంటూ దిగువపట్నం కాలనీ వాసులు నిలదీస్తున్నా.. పట్టించుకోవడం లేదు.

దాడులకు తెగబడుతూ...

పెన్నానది నుంచి ఇసుక అక్రమంగా తరలించుకుంటున్న ట్రాక్టర్ యజమానులు ఒకరిపై ఒకరు పోలీసులకు సమాచారం ఇస్తున్నారు. పోలీసులు ట్రాక్టర్లను పట్టుకుని మైనింగ్ అధికారులకు అప్పగించడం.. వారు జరిమానా విధించడం జరుగుతోంది. అయితే ఈ నేపథ్యంలో కొందరు 'మా ట్రాక్టర్లను పట్టిస్తారా' అంటూ కొడవలితో దాడులకు తెగబడ్డారు. మరింత మంది జరిమానా వేయండి.. ట్రాక్టర్లను తీసుకెళ్తామంటూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. సెబ్ అధికారులు ఇసుకతో సహా ట్రాక్టర్లను యజమానులకు ఇస్తుండడంతో అమ్మి జరిమానా ఖర్చు రాబట్టుకుంటున్నారు. దీంతో అధికారులన్న భయం లేకుండా పోయింది. జరిమానా విధించినా రూ.10వేలే కదా.. అన్న భావనకు వస్తున్నారు.

దాడులు చేస్తూనే ఉన్నాం



పెన్నానది నుంచి అక్రమ ఇసుక తరలిపోతోందనే సమాచారం ప్రతి రోజూ వస్తోంది. తరచూ దాడులు చేస్తున్నాం. పట్టుకున్న ట్రాక్టర్లకు జరిమానా వేస్తు న్నా యథావిధిగా ఇసుక తరలిస్తు న్నట్లు సమాచారం ఉంది. ఇకపై గట్టి చర్యలు తీసుకుంటాం. – కెఎస్.లత, సెబ్ అధికారి

అప్పల బాధతో ఊది బత్తీల వ్యాపారి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక రామేశ్వరంలో పల్లేటి కృష్ణారెడ్డి (50) అనే వ్యక్తి శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణారెడ్డి రామేశ్వరంలోనే ఒక బాడుగ ఇల్లు తీసుకొని ఊది బత్తీల వ్యాపారం చేసుకునేవాడు. వ్యాపార పరంగా అతను ఇటీవల ఎక్కువగా అప్పులు చేశాడు. ఈ క్రమంలో కృష్ణారెడ్డి బాడుగ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లేలోపే అతను చనిపోయి ఉన్నాడు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హైమావతి తెలిపారు.

సార్.. పిచ్చి కుక్క కరిచింది..

మూడు గంటల వ్యవధిలో 33 మంది ఆస్పత్రిపాలు

రాయచోటి టౌన్ : మూడు గంటల వ్యవధిలో 33 మంది.. ।సార్ పిచ్చికుక్క కరిచింది। అంటూ ఆస్పత్రికి వెళ్లడంతో వైద్యులు నివ్వెరపోయారు. ఓ పిచ్చికుక్క విచ్చలవిడిగా తిరుగుతూ ఇలా అందరినీ గాయాలపాలు చేయడమే కారణం. రాయచోటి పట్టణంలో ఓ పిచ్చి కుక్క శనివారం స్వైర విహారం చేసింది. స్థానిక రవి హాల్ నుంచి ఠానా, గాంధీ బజార్, బ్రాహ్మణవీధి, పాత రాయచోటి వరకూ శనివారం కనిపించిన ప్రతి ఒక్కరినీ దాడిచేసి గాయపరిచింది. మూడు గంటల వ్యవధిలో మొత్తం 33 మంది కుక్క కరిచిందంటూ గాయాలతో ఒక్కసారిగా ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లడంతో వైద్యులు నివ్వెరపోయారు. గాయపడిన వారిలో ఆరుగురు చిన్న పిల్లలు ఉన్నారు. వీధి కుక్కలను నియంత్రించాలని టీడీపీ నాయకులు మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అధికారులకు సూచించారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.



పిచ్చికుక్క దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు (ఇన్‌సెట్) కాలికి గాయమైన దృశ్యం